క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన విశ్రాంత వ్యవసాయ శాఖ జేడీ పెట్ల సూర్యనారాయణరాజు

తాళ్లరేవు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సమక్షంలో జగన్‌ను మర్యాదపూర్వకంగా కలసి పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి తన భార్య శాంతకుమారితో కలసి పార్టీ పటిష్ఠతకు కృషి చేసామని ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ తమకు సూచించినట్లు సూర్యనారాయణరాజు తెలియజేసారు.

చలివేంద్రం ప్రారంభం



అమలాపురంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు

అమలాపురం టౌన్: హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామపురంలోని హనుమాన్ సెంటరులో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శ్రీరామపురం పెద్దలు వాసంశెట్టి చినబాబు శుక్రవారం ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ చిప్పల నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటైంది. ట్రస్ట్ ప్రతినిధులు కొప్పాడి రాజు, చిప్పల సుబ్రహ్మణ్యం, శ్రీరామపురం పెద్దలు రాయుడు సత్య రుషి, ఆకుల చక్రధర్, కోలా ఏసుబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ఉప్పలగుప్తంలో ప్రకృతి వ్యవసాయ రైతులను సత్కరిస్తున్న ఏవో కుమార్‌బాబు

ఉప్పలగుప్తం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే విధంగా రైతులకు సహకారం అందించాలని వ్యవసాయాధికారి జి.కుమార్ బాబు అన్నారు. మండలంలోని స్థానిక మహిళా సమాఖ్య భవనంలో ఏపీసీఎన్‌ఎఫ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎమ్ ఏ.సురేంద్ర, ఎస్‌ఎఫ్‌ఏ హేమలత, ఎమ్‌టీ సూరిబాబు, మల్లికార్జునరావు, ప్రకృతి వ్యవసాయ రైతులు అరిగెల నానాజీ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అల్లవరం: కొమరగిరిపట్నం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద అమలాపురం, మామిడికుదురు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. డివిజనల్ పంచాయతీ అధికారి బొజ్జిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, ఎఫ్‌టీసీ మధు మహేష్, సిబ్బందికి అవగాహన కల్పించారు. సంపద కేంద్రాల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట, కంపోస్టు తయారీ విధానంపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు 19వ రోజుకి చేరాయి. టెర్మినల్ వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని పలువురు నాయకులు శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓడలరేవు గ్రామాన్ని ఓఎన్‌జీసీ దత్తత తీసుకోవాలని, గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, కొల్లు విష్ణుమూర్తి, రొక్కాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదరపల్లి వంతెనకు మోక్షం

- అమలాపురంలో ట్రాఫిక్ సమస్య జటిలం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం
- ఎన్నికల కోడ్ రావడంతో నాడు పనులకు ఆటంకం
- రూ.2 కోట్లతో నూతన వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు
- ఆక్రమణల తొలగింపునకు అధికారులతో కమిటీ ఏర్పాటు



ఈదరపల్లి వంతెన



నూతన వంతెన నిర్మించనున్న ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు

అమలాపురం రూరల్: అమలాపురం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ జటిలమవుతున్నాయి. గత ప్రభుత్వంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా ఈదరపల్లిలో రూ.2 కోట్లతో నూతన వంతెన నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో వంతన నిర్మాణ ప్రతిపాదనలు, నిధుల విడుదలకు ఆటంకం ఏర్పడింది. ఇటీవల కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఈదరపల్లి వద్ద నూతన వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రకటించారు. వంతెనకు ఇరువైపులా ప్రస్తుతం ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈదరపల్లి వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య అధికమైన నేపథ్యంలో కనీసం అంబులెన్స్ వెళ్లాలన్నా ఈ వంతెన వద్ద కష్టతరంగా మారింది. అదేవిధంగా ట్రాఫిక్ రద్దీ ఉండటంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే కలెక్టర్ రూ.2 కోట్లు మంజూరు చేయడంతో వంతెన నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.

ప్రగతికి నోచుకోని రహదారులు

ఎన్నో ఏళ్లుగా అమలాపురంలో ప్రగతికి నోచుకోని రహదారులు కూడళ్లు వంతెనలు మూలంగా ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. నూతనంగా ఏర్పడిన అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో పురాతనమైన వంతెనలు ఉండడంతో జిల్లా కేంద్రం స్థాయి ట్రాఫిక్ రద్దీకి తగ్గట్టుగా లేని దృష్ట్యా వీటిని అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లకాలం క్రితం నిర్మించిన వంతెనలపైనే ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ సమస్య తీవ్రతరమైంది. అధిక పరిమాణంలో వాహనాల కారణంగా సమస్య ఉత్పన్నమవుతోంది.

శిథిలావస్థకు చేరుకున్న వంతెన

వంతెనపై నిత్యం ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది. రోజూ ఏదో సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. 60 ఏళ్ల కిందట ఈదరపల్లి వంతెన నిర్మించారు. వంతెనపై వేలాది వాహనాలు వెళుతున్నాయి. ఫుట్‌పాత్ పూర్తిగా శిథిలమైంది. వంతెన రైలింగ్ దెబ్బతింది. ఫుట్‌పాత్‌పై ప్రజలు నడిచి వెళ్లే పరిస్థితి కనిపించడంలేదు.

గతం ప్రభుత్వంలో వంతెన ప్రతిపాదనలు

అమలాపురంలో మూడవ వంతెన నిర్మాణంలో భాగంగా ఈదరపల్లిలో నూతన వంతెన నిర్మాణానికి అప్పటి రవాణశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. కేంద్ర రవాణశాఖ మంత్రితో విశ్వరూప్ మాట్లాడి సీఆర్‌ఐ నిధులు రూ.2 కోట్లతో వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. అల్లవరం మండలం కొమ్మరగిరిపట్నం- సామంత్రకుర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణంతో పాటు వంతెన నిర్మాణం కలిపి ఒక ప్యాకేజీగా నిధులు కేటాయించారు. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో జీవో విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం ఈ నిధుల అంశాన్ని పట్టించుకోలేదు.

నూతన వంతెన నిర్మాణం

ప్రస్తుతం వంతెన పక్కన కొత్త వంతెన నిర్మాణం చేపట్టానున్నారు. అమలాపురం నల్లవంతెన బైపాస్‌రోడ్డు వైపు కొత్త వంతెన నిర్మాణం చేపట్టానున్నారు. పాత వంతెన మాదిరిగానే 9 మీటర్ల వెడల్పు 12 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ అంచనాలు సిద్ధం చేసింది. వంతెన వద్ద అక్రమణలు, వినాయక ఆలయం కొన్నిషాపులు ఉన్నాయి వీటిని తొలగించి కొత్త వంతెన నిర్మించనున్నారు.

ఆక్రమణల తొలగింపునకు కమిటీ

వంతెన వద్ద ఆక్రమణల తొలగింపునకు ఆర్డీఓ కే.మాధవి, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము, జల వనరుల శాఖ డీఈ బి.శ్రీనివాసరావు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎస్.రాజబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌తో ఒక కమిటీ నియమించారు. ఈ కమిటీ ఆక్రమణలను గుర్తించడంతోపాటు ఆక్రమిత స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, షాపులను తొలగించేందుకు నివేదిక రూపొందించి తొలగింపునకు చర్యలు చేపడుతుంది.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



రూ.2 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనాలు సిద్ధం చేశాం. ప్రస్తుతం వంతెన పక్కన కొత్త వంతెన నిర్మించనున్నారు. పాత వంతెన మాదిరిగానే 9 మీటర్ల వెడల్పు 12 మీటర్ల పొడవున వంతెన నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేశాం. వంతెన వద్ద ఆక్రమణల తొలగింపునకు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాం.

– తోట రమేష్ ఆర్‌అండ్‌బీ ఏఈ అమలాపురం

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధిలో 500 గజాల స్థలాన్ని మార్కెట్‌కు దానం చేసానని సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు చెపుతున్నారని, రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా నమోదైన ఆ స్థలాన్ని ఆయన ఎలా దానం చేస్తారని స్థానిక నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, నాయకులు మోపూరి వెంకటరెడ్డినాయుడు, గుత్తుల నాగేశ్వరరావు, పితాని అర్జున్‌రావు తదితరులు సమావేశంలో మాట్లాడారు. 125 సర్వే నంబరులో 500 గజాల స్థలాన్ని కేంద్రపాలిత ప్రాంతమైన యానాం కనకాలపేటకు చెందిన మత్స్యకారులకు దానం చేసానని సర్పంచ్ చెపుతున్నారని, అయితే ఆ స్థలం ప్రభుత్వానికి చెందినదని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ.వలీబాబా ధ్రువీకరించారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆ భూమి ప్రభుత్వానికి చెందినదా? లేక సర్పంచ్‌కు చెందినదో తేల్చాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని తనదిగా పేర్కొంటున్న సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. 123, 125 సర్వే నంబర్లలో ఉన్న నిషేధిత భూములకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు సర్వే జరిగిందని, ప్రభుత్వ భూములకు కంచె వేసి పరిరక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డి ఏడుకొండలు, చిక్కం హనుమంతరావు, రాజు, అశోక్, శంకర్రావు, భద్రరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

గుళికలు కలిపిన తవుడు తిన్న ఆవు దూడలకు అస్వస్థత



అస్వస్థతకు గురైన ఆవు దూడకు వైద్యం చేస్తున్న డాక్టర్ విజయరెడ్డి, చిత్రంలో గో సేవకులు

అమలాపురం టౌన్: గుళికలు కలిపిన తవుడు తని రెండు ఆవు దూడలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. అమలాపురం నల్లవంతెన దిగువన ముక్తేశ్వరం రోడ్డులో ఓ వ్యక్తి తన పొలాన్ని పశువుల బెడద నుంచి కాపాడుకునేందుకు పేపర్ ప్లేట్లలో గుళికలు కలిపిన తవుడును ఉంచారు. వాటిని శుక్రవారం ఉదయం రెండు ఆవు దూడలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ ఆవు దూడలను చూసి గో సేవకుడు వాకపల్లి చిన్నా తదితరులు స్పందించి అమలాపురం పశు సంవర్ధక శాక సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డికి సమాచారం అందించారు. డాక్టర్ విజయరెడ్డి బృందం ఆవు దూడలకు వైద్య సేవలు అందించారు. చికిత్స అనంతరం ఆవు దూడలను స్థానిక శ్రీగౌతమ మహర్షి గో సంరక్షణ గోశాల అప్పగించారు. పొలంతో గుళికలు కలిపిన తవుడు మిశ్రమాన్ని పేపర్ ప్లేట్స్‌లో మొత్తం 10 చోట్ల పెట్టినట్టు గో సేవ కులు గుర్తించారు. ఆ దారుణానికి కారణమైన బాధ్యులపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు తెలిపారు. ప్రస్తుతానికి చికిత్స పొందిన ఆ రెండు ఆవుదూడల్లో ఒక దాని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ తెలిపారు.

రీజెన్సీ పరిశ్రమ తెరిచేలా సహకరించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాంలో మూత పడ్డ వందలాది చిన్న తరహా, మధ్య తరహా, భారీ పరిశ్రమలను తిరిగి తెరిచే విధంగా చర్యలు తీసుకుని పారిశ్రామికాభివృద్ధికి సహకారం అందించాలని పుదుచ్చేరి ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధిని కల్పించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా యానాం ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డ రీజెన్సీ భారీ పరిశ్రమ 13 ఏళ్లుగా మూతపడిందని దానిని తెరిచేందుకు సహకరించాలని, యాజమాన్యాన్ని సైతం ప్రోత్సహించాలని కోరారు. కొన్ని నెలల క్రితం రీజెన్సీ ఫ్యాక్టరీని తెరిచేలా సంబంధిత యాజమాన్యం చర్యలు తీసుకుంటే వివిధ కారణాలతో పాటు ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో మళ్లీ మూసివేశారన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు, కార్మికులకు ఉపాధి కల్పించడంపై దృష్టిసారించాలని అన్నారు. కొన్ని నెలలుగా ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని సభకు తెలిపారు. మున్సిపాలిటీకి పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్ కేడర్ అధికారి నియామకంలో ఆలస్యం జరుగుతోందన్నారు. పీడబ్ల్యూడీ శాఖతో ప్రధాన రహదారులు, నివాసాల చెంత డ్రెయినేజీల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. సాగు, తాగునీటి సమస్య తీసుకోవాల్సిన చర్యలు, ఎల్‌ఏడీ శాఖకు సంబంధించిన వివిధ పనులు, సమస్యలను ఆయన ప్రస్తావించారు.

యానాం బంద్ ప్రశాంతం

యానాం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించకపోవడంతో 20 రోజులుగా ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త తదితర వ్యర్థాలతో పడుతున్న ఇబ్బందులను, అనారోగ్య సమస్యలను పుదుచ్చేరి ప్రభుత్వానికి తెలియజేసేలా శుక్రవారం నిర్వహించిన యానాం బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఏఐఏడీఎంకే పిలుపునిచ్చిన ఈ బంద్‌కు యానాం వర్తక సంఘంతో పాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వర్తకులు తమ షాపులను స్వచ్ఛందంగా మూసివేశారు. పలువురు వర్తకులు మాట్లాడుతూ ప్రధానమైన పారిశుధ్య సమస్యను మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడంతోపాటు డంపింగ్‌యార్డుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎంకే కార్యదర్శి మంచాల సాయి, వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, మాజీటి సత్యభాస్కర్, మాజీ బీజేపీ అధ్యక్షుడు మాగాపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



బంద్‌తో యానాంలో మూతపడ్డ వ్యాపార సంస్థలు

పచ్చిరొట్ట సాగుతో నేలలో పోషకాల వృద్ధి



రైతులకు విత్తనాలను అందిస్తున్న ఏవో ధర్మప్రసాద్

అమలాపురం రూరల్: రబీ వరి చేలు నాలుగు రోజుల్లో కోతకు ముందుగా పీఎండీఎస్ 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో చల్లడం వల్ల భూమిలో పోషకాలతోపాటు కార్బన్ శాతం పెరిగి నేలకు నీటిని నిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కడలి ధర్మప్రసాద్ అన్నారు. అమలాపురం మండలం నల్లమిల్లిలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పీఎండీఎస్ 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను ఒక ప్యాకెట్‌లో సిద్ధం చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 30 రకాల్లో ఒక్కొక్క విత్తనం ఒక్కొక్క సూక్ష్మజీవి భూమికి అందిస్తుందని తెలిపారు. కమ్యూనిటీ మేనేజడ్ నేచురల్ ఫార్మింగ్ ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ విత్తనాలు చల్లి భూమిని కప్పి ఉంచడం వల్ల అధిక ఉష్ణోగ్రత భూమికి తగలకుండా కాపాడుతుందన్నారు. రైతు కాయగూరలు, ఆకుకూరలు ప్రకృతి సిద్ధంగా కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించి పంటలు పండించుకుంటే అందరి ఆరోగ్యం బాగుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రేమకుమార్ హేమలత, ఎంటీ సూరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, మండలం ఎస్ఎఫ్ ఇన్‌చార్జ్ అప్పారి వెంకటరమణ, వాకపల్లి శ్రీను, బద్దే రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీడితులకు అండగా కవిత్వం

మండపేట: కవిత్వం అంటే భావాల వెల్లడి మాత్రమే కాదని, పీడితులకు అండగా ఉండే కవిత్వమే శాశ్వతంగా నిలుస్తుందని సాహితీ గోదావరి అధ్యక్షులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం, మండపేట సంగమం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం అన్నపూర్ణ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అరసం జిల్లా అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్ స్వాగత వచనాలు పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలను వినిపించారు. సమాజం ఎదుర్కొంటున్న వివిధ సామాజిక అంశాలపై కవులు వినిపించిన కవితలు ఆహుతులను అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కవి సామాజికవేత్త మేక గౌరవ్, డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యావేత్త వల్లూరు సత్యనారాయణ చౌదరి, కళామిత్ర మీరాబి, ప్రముఖ కవులు గొడవర్తి శ్రీనివాస్, ఆర్‌వీవీ రాజా, శ్రీనివాసచార్యులు, అవసరాల మాధవరావు, వినకోటి రాజేష్ కుమార్, కల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులో శిక్షణ

అమలాపురం రూరల్: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో పదో తరగతి పాస్ ఆపై అర్హత కలిగి 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ స్వల్పకాలిక కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.ఆర్.ఆర్. కృష్ణన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డ్, జెరాక్స్, ఫోన్ నంబర్ ఈ మెయిల్ ఐడీతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం పని వేళలో సంప్రదించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ప్రముఖ కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని అన్నారు. పూర్తి వివరాలు కోసం సెల్ 8328507473 సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐటీఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో శుక్రవారం నిర్వహించిన పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ముమ్మిడివరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఠానేల్లంక ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. మండలంలో మొత్తం 753 మంది విద్యార్థులకు 751 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అమలాపురం డీవైఈఓ జి.సూర్యప్రకాశం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని చోట్ల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం రూరల్: ఒక బెల్ట్ షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్సై బాలాజీ బృందంతో మండలంలో బెల్ట్ షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. బండారులంకలో దొమ్మేటి రామకృష్ణ అనే వ్యక్తి పరిమితికి మించి మద్యం సీసాలు కలిగి ఉండటం వల్ల అరెస్టు చేసి నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.

బైపాస్ జంక్షన్‌లో పోలీస్ పహారా



కామనగురువు బైపాస్‌రోడ్డులో పోలీస్ పహారా

అమలాపురం రూరల్: అమలాపురం బైపాస్ రోడ్డులో కామనగురువు ఆమని ఆటోమొబైల్ జంక్షన్ వద్ద ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా పోలీస్ రక్షణ ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, తాలూకా ఎస్సై శేఖర్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆమని ఆటోమొబైల్ బైపాస్ జంక్షన్‌లో పోలీస్ రక్షణ ఏర్పాటు చేశారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వెళ్లే సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వహిస్తారు. బైపాస్ జంక్షన్ వద్ద పోలీసులను పోలీస్ పహారా ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: ఓ మహిళ వెంట పడుతూ ఆమెను తరుచూ వేధిస్తున్న అయినవిల్లి మండలం నేదునూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి దుర్గా ప్రసాద్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ ఎస్సై నరహరిశెట్టి రామ కిషోర్‌బాబు తెలిపారు. అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో కాలనీకి చెందిన ఓ మహిళ అమలాపురంలోని డీటీడీసీ కొరియర్‌లో పనిచేస్తోంది. ఆమె వెంట పడి రామ దుర్గా ప్రసాద్ వేధిస్తున్నాడని బాధితరాలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనను ప్రేమించకపోతే కత్తితో చంపుతానని మహిళను బెదిరించడమే కాకుండా ఆమె సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని పరారయ్యాడు. రామదుర్గా ప్రసాద్‌పై బాధితురాలు ఈనెల 18న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. నిందితుణ్ణి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా అతడికి 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. నిందితుడిని కొత్తపేట సబ్‌జైలుకు తరలించామన్నారు.

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా డాక్టర్ దీపక్ చక్రవర్తి



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను అందుకుంటున్న డాక్టర్ దీపక్ చక్రవర్తి

అమలాపురం టౌన్: పాండిచ్చేరిలో జరిగిన నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో కోనసీమ జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎమ్‌ఏ) నుంచి అమలాపురం డాక్టర్స్ క్రికెట్ లీగ్ టీమ్ పాల్గొని సత్తా చాటింది. ఈ నెల 19 నుంచి జరుగుతున్న ఆ పోటీల్లో గుంటూరు జిల్లా డాక్టర్స్ జట్టుతో అమలాపురం డాక్టర్స్ జట్టు తలపడింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో అమలాపురం డాక్టర్స్ జట్టు విజేతగా నిలిచింది. అమలాపురానికి చెందిన డాక్టర్ దీపక్ చక్రవర్తి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును సాధించారు. పాండిచ్చేరి నగరంలో జరిగిన ఈ డాక్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని జిల్లాలకు చెందినజట్లు పాల్గొన్నాయి.

బైపాస్‌లో ఆక్రమణల తొలగింపు



పేరూరు వై జంక్షన్ వద్ద ఆక్రమణల తొలగింపు

అమలాపురం రూరల్: పేరూరు బైపాస్ రోడ్డువై జంక్షన్ ప్రమాదాలను నివారించేందుకు పోలీస్, హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపట్టారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శుక్రవారం తొలగిస్తున్నారు. ఇంతవరకు పేరూరు వై జంక్షన్‌లో బైపాస్ రోడ్డు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి కొంతమంది షాపులు నిర్మించి వాటిని అద్దెకు ఇస్తున్నారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న అక్రమంగా నిర్మించిన షాపులను జేసీబీ సహాయంతో అధికారులు తొలగించారు. వై జంక్షన్ నుంచి మేకల కాలువ వంతెన వరకు ఉన్న ఆక్రమణలను తీసేశారు.

పేదలు, అనాథలకు అన్నదానం



అమలాపురంలో అనాథలు, యాచకులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ఎఫ్ 3 ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు పట్టణంలోని పేదలు, అనాథలు, యాచకులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఎఫ్ 3 ఫౌండేషన్ సభ్యులతోపాటు వాకర్స్ మహిళలు పట్టణంలోని పలు రోడ్లు, వీధుల్లో పర్యటించి అనాథలు, యాచకులకు ఆహార పొట్లాలు అందించారు. ఎఫ్ 3 ఫౌండేషన్ కొన్నేళ్లుగా పట్టణంలో పేదల ఆకలి తీర్చుతూ సేవా మార్గంలో నడుస్తోందని వాకర్స్ మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంత లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ 3 ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్బాసీ (జానీ), మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

యానాం: ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులుకు పుదుచ్చేరి ఆది ద్రావిడ శాఖ మంత్రి సాయిశర్వణన్ ఆమోదం తెలిపారని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పనులకు సంబంధించి తదుపరి ఎల్జీ కె కైలాషనాథన్ ఆమోదం పొందిన వెంటనే టెండర్ ప్రయ ప్రారంభమవుతుందని తెలిపారు. దరియాలతిప్ప ఓపెన్ ఆడిటోరియం అభివృద్ధికి రూ.12.75 లక్షలు, రభాభాయి నగర్ డ్రెయిన్ పనులకు రూ.17.50 లక్షల, దరియాలతిప్ప ఇండోర్ స్టేడియం వెంటిలేషన్‌కు రూ.7 లక్షలు, అంబేడ్కర్ జంక్షన్ నుంచి రక్షాహరికృష్ణ ఇంటి వరకు డ్రెయిన్‌కు రూ.21 లక్షలు, దరియాలతిప్ప మహాలక్ష్మమ్మగుడి రోడ్డుకు రూ. 21లక్షలు, ప్రభుత్వ పాఠశాల సిమెంట్ రోడ్డుకు రూ.2.45 లక్షలు, పరంపేట నూతన రహదారిలో బెంచ్‌లు, మరమ్మతులకు రూ.3.05 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.కోటి విలువైన పనులను ఎల్జీ ఆమోదం అనంతరం ప్రారంభిస్తామన్నారు.